సాక్షి
రాజన్న సిరిసిల్ల

శనివారం । 30 । సెప్టెంబర్ । 2023

వంతెన కష్టాలు తీరేదెన్నడో?



బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి నుంచి కొదురుపాక వెళ్లే దారిలో ఉన్న వంతెన మరమ్మతు పనులు చేస్తుండడంతో మోడల్‌స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెన దాటితేనే మోడల్‌స్కూల్‌కు వెళ్లే పరిస్థితి. కల్వర్టు శిథిలావస్థకు చేరగా.. ఇటీవల మరమ్మతు పనులు మొదలుపెట్టారు. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి అక్కడ బురదమయమై విద్యార్థులు నడిచేందుకు ఇబ్బంది పడ్డారు. త్వరగా మరమ్మతు పనులు పూర్తి చేయాలని విద్యార్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

బతుకమ్మ చీరల బట్టను ఇవ్వండి

- నేడు చివరి అవకాశం
- జౌళిశాఖ ఏడీ సాగర్



మిట్టకోల సాగర్ జౌళిశాఖ ఏడీ

సిరిసిల్ల: వస్త్రోత్పత్తిదారులు తమ వద్ద నిల్వ ఉన్న బతుకమ్మ చీరల బట్టను వెంటనే అందించాలని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు మిట్టకోల సాగర్ కోరారు. 2023కు సంబంధించిన బతుకమ్మ చీరల ఆర్డర్లు పొందిన వస్త్రోత్పత్తిదారులు శనివారం సాయంత్రం 5 గంటల వరకు పూర్తి స్థాయిలో బట్టను అందించాలన్నారు. ఈనెల 15, మళ్లీ 25 వరకు గడువు పొడగించామన్నారు. వస్త్రోత్పత్తిదారుల నుంచి వచ్చిన విజ్ఞప్తితో 30వ తేదీని టెస్కో అధికారులు చివరి అవకాశంగా కల్పించారని తెలిపారు. శనివారం తరువాత బతుకమ్మ బట్ట సేకరణ ఉండదన్నారు.

యువకుడిని కాపాడిన పోలీసులు



హఫీజ్(ఎర్ర చొక్కా)తో పోలీసులు

బోయినపల్లి(చొప్పదండి): ఆత్మహత్య చేసుకుంటానని 100 నంబర్‌కు కాల్‌చేసి బెదిరించిన కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన హఫీజ్ బ్లూ కోట్ పోలీసులు గురువారం రాత్రి కాపాడారని బోయినపల్లి ఎస్సై మహేందర్ శుక్రవారం తెలిపారు. హఫీజ్ ఆత్మహత్య చేసుకుంటానని బ్లూకోట్ పోలీసులకు ఫోన్ చేసి కొదురుపాక పరిసరాలకు వచ్చాడు. విషయం తెలుసుకున్న బ్లూకోట్ సిబ్బంది నరేశ్‌కుమార్, వాసుదేవరావు అక్కడికి చేరుకొని హఫీజ్‌కు కౌన్సిలింగ్ ఇచ్చి, కరీంనగర్‌లోని అతని బావ గఫూర్‌కు అప్పగించారు.

ఇల్లంతకుంటలో జగిత్యాల అడిషనల్ డీఆర్డీవో



తంగళ్లపల్లి(సిరిసిల్ల): జగిత్యాల జిల్లా అడిషనల్ డీఆర్డీవో సుధీర్ శుక్రవారం ఇల్లంతకుంట మండలంలో పర్యటించారు. టీఎస్ సెర్ప్ డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నెలకొల్పిన ఎంటర్‌ప్రైజెస్ యూనిట్లను పరిశీలించారు. డీపీఎం సుధారాణి, ఏపీఎంలు శ్రీనివాస్, వాణి, సీసీ రాజేశ్వరీ ఉన్నారు.

నేడు బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశం

వేములవాడ: నియోజకవర్గస్థాయి పార్టీ విస్తృతస్థాయి సమావేశం శనివారం ఎమ్మెల్యే రమేశ్‌బాబు అధ్యక్షతన నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ హాజరుకానున్నారు. చెన్నమనేని రమేశ్‌బాబు, చల్మెడ లక్ష్మీనర్సింహారావు మొదటిసారి ఒకే వేదికను పంచుకోనున్నారు. పెండింగ్ పనుల నిధులు కేటాయింపే తన డిమాండ్ అని ఎమ్మెల్యే రమేశ్‌బాబు శుక్రవారం 'సాక్షి'కి తెలిపారు. ప్రజలకిచ్చిన వాగ్దానాలు నెరవేర్చేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. త్వరలోనే సీఎం కేసీఆర్ వేములవాడలో పర్యటిస్తారని, ఈలోపే నియోజకవర్గానికి రావాల్సిన నిధుల మంజూరుకు సీఎం కేసీఆర్ సమ్మతించినట్లు తెలిపారు.

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను ఆదరిద్దాం



వేములవాడ: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను ఆదరించాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడలోని తన నివాసంలో శుక్రవారం చీర్లవంచ, గుర్రంవాణిపల్లికి చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. ఎడ్ల నర్సింహారెడ్డి, కంది రాజిరెడ్డి, ఉమ్మారెడ్డి మహిపాల్‌రెడ్డి, గుర్రం సత్తిరెడ్డి, గుర్రం లక్ష్మారెడ్డి, మంద మోహన్‌రెడ్డి, మంద అనిల్‌రెడ్డి, మంద అశోక్‌రెడ్డి, ఉమ్మారెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

నిర్మాణాలు జోరుగా.. ఉపాధి మెండుగా..

- ఊపందుకున్న భవన నిర్మాణ పనులు
- కూలీలకు చేతినిండా పని
- జిల్లాలో పది వేలకు పైగా ఇతర ప్రాంత కూలీలు
- ఒక్కో భవనానికి రూ.25 లక్షల నుంచి రూ.కోటికి పైగా ఖర్చు
- సొంతింటి కోసం భారీగా వెచ్చిస్తున్న జనం



ఇతను ఎల్లారెడ్డిపేటకు చెందిన తోట శ్రీధర్. ఇన్నాళ్లు అద్దె ఇళ్లలో ఉంటూ అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అరకొర వసతులతో కాలం వెల్లదీసిన ఇతను వారసత్వంగా వచ్చిన స్థలంలో సొంతంగా ఇంటిని నిర్మించుకోవాలనుకున్నాడు. మధ్య తరగతి కుటుంబానికి చెందిన శ్రీధర్.. ఖర్చుకు వెనుకాడకుండా తనకు నచ్చిన విధంగా ఇంటిని నిర్మించుకుంటున్నాడు. ఆధునిక వసతులు ఏర్పాటు చేసుకుంటున్నాడు. భవన నిర్మాణ పనులను ఆంధ్రకు చెందిన కాంట్రాక్టర్‌కు అప్పగించి, తనకు నచ్చిన విధంగా పనులు చేయించుకున్నాడు.



అందంగా తీర్చిదిద్దిన ఇంటీరియల్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కరోనా సంక్షోభంతో మందగించిన భవన నిర్మాణ పనులు ఇటీవల ఊపందుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లో దాదాపు రెండు వేలకు పైగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. కూలీలను మధ్యప్రదేశ్, ఒడిశా, బిహార్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి కాంట్రాక్టర్లు తెప్పిస్తున్నారు. ఇలా వచ్చిన వారు జిల్లా వ్యాప్తంగా దాదాపు పది వేలకు పైగా పనిచేస్తున్నారు. భవన నిర్మాణాలు ఊపందుకోవడంతో సిమెంట్, ఇనుము, ఇసుక ధరలు సైతం పెరిగిపోయాయి. ఇటు వ్యాపారులకు బిజినెస్ ఊపందుకోగా.. కూలీలకు చేతినిండా పని దొరుకుతుంది.

నిర్మాణ వ్యయం ఇలా..

అద్భుత సౌకర్యాల కల్పనలో భాగంగా ఒక్కో ఇంటిలో ఇంటీరియల్, హోమ్‌థియేటర్, మోడర్న్‌కిచెన్, ఫైవ్‌స్టార్ హోటల్‌కు తగ్గని స్థాయిలో బెడ్‌రూమ్‌లు, గుడిని పోలినట్టు ఉండేలా పూజాగదులు, పార్క్‌ను తలపించేలా గార్డెన్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. పెరిగిన నిర్మాణాలతోపాటు ముడిసరుకు ధరలు సైతం పెరిగాయి. గతంలో ఒక్క ఫీట్ భవన నిర్మాణానికి రూ.220 ఉండగా.. ప్రస్తుతం రూ.360కి పెరిగింది. సిమెంట్ బస్తాకు రూ.310 ఉండగా.. రూ.330 వరకు చేరింది. స్టీల్ క్వింటాల్‌కు రూ.5800 ఉండగా... ఇప్పుడు రూ.6200లకు ఎగబాకింది. ఇసుక ధర అమాంతం మూడు రెట్లు పెరిగి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3వేల చొప్పున తీసుకుంటున్నారు.

ఇతర ప్రాంత కూలీలకు ఉపాధి

స్థానికంగా కూలీల కొరత, భవన నిర్మాణాల్లో నైపుణ్యత లేకపోవడంతో ఇతర రాష్ట్రాల కూలీలు పెద్దసంఖ్యలో జిల్లాలో ఉపాధి పొందుతున్నారు. భవన నిర్మాణాల్లో ప్రథమదశ పునాది నుంచి మొదలుకొని స్లాబ్, ఇంటీరియల్ వర్క్ పూర్తయ్యే వరకు ఇతర ప్రాంతాల కూలీలపైనే ఆధార పడాల్సి వస్తోంది. దశాబ్దం క్రితం మన ప్రాంతానికి మేస్త్రీలుగా ఆంధ్ర ప్రాంతం నుంచి వచ్చిన వారు నిర్మాణాల్లో తగిన నైపుణ్యాలు పెంచుకొని నేడు కాంట్రాక్టర్లుగా పనిచేస్తున్నారు. ఇలాంటి వారు జిల్లా వ్యాప్తంగా దాదాపు వెయ్యి మంది వరకు కాంట్రాక్టర్లుగా పనిచేస్తున్నారు. వీరి వద్ద బిహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన దాదాపు పది వేలకు పైగా కూలీలు ఉపాధి పొందుతున్నారు. స్థానిక కూలీలకు మార్బుల్‌వర్క్, ఇంటీరియల్ డిజైనింగ్‌పై అవగాహన లేక ఇతర రాష్ట్రాల కూలీలకు ఉపాధి మెండుగా దొరుకుతుంది.

పెరిగిన నిర్మాణాలు

జిల్లా వ్యాప్తంగా దాదాపు 2 వేలకు పైగా భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. సొంతింటి కల నెరవేర్చుకునేందుకు జిల్లా ప్రజలు ఉన్న దాంట్లోనే సర్దుకుపోకుండా రూ.25 లక్షల నుంచి రూ.కోటికి పైగా ఖర్చు చేస్తున్నారు. ఒక్కో ఇంటికి ఇంటీరియల్ డిజైనింగ్ కోసం రూ.10 లక్షల వరకు వెచ్చిస్తూ సూపర్ లక్జరీ వసతులు ఏర్పాటు చేసుకుంటున్నారు. మార్బుల్‌ను ప్రత్యేకంగా హైదరాబాద్, ముంబయి, జైపూర్ వంటి మహానగరాల నుంచి దిగుమతి చేసుకుని, సొంతింటి కలను మరింత అందంగా తీర్చిదిద్దుకుంటున్నారు.

నా దగ్గర 90 మంది పనిచేస్తున్నారు



నేను ముప్పై ఏళ్ల క్రితం ఈ ప్రాంతానికి వచ్చాను. ప్రస్తుతం నా దగ్గర మహారాష్ట్ర, బిహార్, రాజస్థాన్ ప్రాంతాలకు చెందిన కూలీలు 90 మంది వరకు పనిచేస్తున్నారు. కొంతమంది మేస్త్రీలు, సెంట్రింగ్‌వర్కర్లు ఉపాధి పొందుతున్నారు. కరోనా తర్వాత కూలీల వేతనం కూడా పెంచాం. ఇంటి యజమానులు కోరిన విధంగా ఎలివేషన్, డూప్లెక్స్ భవనాలు నిర్మిస్తున్నాం.

– కంది లక్ష్మారెడ్డి, భవన నిర్మాణ కాంట్రాక్టర్

వ్యాపారం పెరిగింది



ఇటీవల ఇళ్ల నిర్మాణాలు జోరందుకోవడంతో వ్యాపారం పెరిగింది. సిమెంట్, సలాక, కలర్స్, ఇంటీరియల్ డిజైన్లకు అవసరమైన ముడిసరుకు అమ్ముడుపోతుంది. ధర ఎంతైన ఆలోచించడం లేదు. క్వాలిటీ మెటీరియల్ కొని వారికిష్టమైన విధంగా ఇళ్లను నిర్మించుకుంటున్నారు. కరోనా సమయంలోనూ, తర్వాత కూడా ఒక ఏడాది వరకు బిజినెస్ అంతంతే ఉండేది. గత ఆరు నెలలుగా వ్యాపారం బాగా ఉంది.

– బుస్స గంగాధర్, హార్డ్‌వేర్ వ్యాపారి

రూ.170 కోట్లతో 4,800 ఇళ్లు నిర్మించి ఇస్తాం

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: నియోజకవర్గంలో రూ.170 కోట్లతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. స్థానిక సంగీత నిలయంలో శుక్రవారం రెవెన్యూ అధికారులు, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అధికారులు దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేశారన్నారు. మొదటి విడతగా 1100 మందికి గృహలక్ష్మి అనుమతి పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. వేములవాడ పట్టణంలో రూ.55 కోట్లతో 1200 కుటుంబాలకు లబ్ధి చేకూర్చనున్నట్లు వివరించారు. 400 మందికి గృహలక్ష్మి, 800 మందికి 90 గజాలు, రూ.5.30 లక్షల చొప్పున లే- ఔట్ ప్లాట్లు సిద్ధం చేసినట్లు చెప్పారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. వేములవాడ ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, హౌసింగ్ ఏడీ భాస్కర్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, జగిత్యాల జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, జెడ్పీటీసీలు నాగం భూమయ్య, మ్యాకల రవి, ఎంపీపీలు రేవతి, స్వరూప, లావణ్య, వజ్రవ్వ, చంద్రయ్యగౌడ్, ఉమాదేవి, సెస్ వైస్‌చైర్మన్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో సీజనల్ వ్యాధులను అరికట్టాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులు, మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్‌నర్సులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో జిల్లాలో డ్రైడేలను విధిగా నిర్వహించాలని, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులను అరికట్టాలన్నారు. హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు 70 నుంచి 80 శాతానికి చేరుకున్నాయని, పీహెచ్‌సీలు, 24 గంటల ఆస్పత్రుల్లో డెలివరీలు చేయాలని సూచించారు. రిస్క్ కేసులను జిల్లా, ప్రాంతీయ ఆస్పత్రులకు తరలించాలన్నారు. ఆరోగ్య మహిళను మరింత పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కిరణంలో 84 కేసులు రాగా.. 17 మందికి మెడికేషన్ అందించినట్లు తెలిపారు. మెడికల్ కాలేజీలో పెండింగ్ సివిల్‌వర్క్‌లను పూర్తి చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు ఎన్.ఖీమ్యానాయక్, బి.గౌతమ్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్‌రావు, జిల్లా ఉప వైద్యాధికారులు శ్రీరాములు, రజిత, వేములవాడ ఆస్పత్రి పర్యవేక్షకులు మహేశ్‌రావు పాల్గొన్నారు.



ఉత్తమ ఏఎన్‌ఎంకు ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్

మీ చొరవ.. అందరికి స్ఫూర్తి

జిల్లాలో ఉత్తమ సేవలందించిన ఏఎన్‌ఎంలను కలెక్టర్ అనురాగ్ జయంతి అభినందించారు. తమ పరిధిలో వందశాతం ప్రసవాలను ప్రభుత్వ ఆస్పత్రిలోనే జరిపించిన వీర్నపల్లి ఏఎన్ఎం ఎస్.కీర్తి, లక్ష్మీపూర్ ఏఎన్ఎం పి.మాధవి, గంభీరావుపేట–1 ఏఎన్ఎం కె.ప్రమీలకు ప్రశంసాపత్రాలు అందించారు. మీ చొరవ.. ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తుందని, ఇదే పనితీరును కొనసాగించాలన్నారు.

ఆ యువకుడి ఆర్థిక మూలాలపై ఆరా !

- సిరిసిల్ల, హైదరాబాద్ నుంచి రహస్య నివేదిక

సిరిసిల్ల: జిల్లా కేంద్రానికి చెందిన ఓ మహిళా కౌన్సిలర్ తనయుడు ఇటీవల స్థానికంగా వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఛత్రపతి శివాజీ, హనుమాన్ జయంతి వేడుకలను భారీ ఎత్తున నిర్వహించారు. ఆషాఢంలో బోనాల పేరిట అమ్మవారి శక్తి రూపాల ప్రదర్శన చేపట్టారు. నూలుపౌర్ణమి వేడుకలు, యోగా డే వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల వెయ్యి మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేశారు. తాజాగా ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను సొంత ఖర్చులతో తన అనుచరులతో నిర్వహించారు. సిరిసిల్లలో సదరు యువకుడి కార్యక్రమాలు చర్చనీయాంశంగా మారాయి. అధికార బీఆర్‌ఎస్ పార్టీ నేతలకు ధీటుగా ఆ యువకుడు భారీ ఎత్తున యువకులను చేరదీస్తూ కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నారు. దీంతో సదరు యువకుడి ఆర్థిక మూలాలపై ఇంటలిజెన్సీ పోలీసులు ఆరా తీస్తున్నారు.

పెద్దగా ఆస్తులు లేకున్నా...

సిరిసిల్లలో వందల కోట్లు ఉన్న సంపన్నులు ఉండగా.. పెద్దగా ఆస్తులు లేని యువకుడు ఇలా నీళ్లప్రాయంలా డబ్బులు ఖర్చు చేస్తూ సామాజిక కార్యక్రమాలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. సదరు యువకుడు హైదరాబాద్ వెళ్లి ఏం వ్యాపారం చేశాడు? ఎంత సంపాదించాడు? ఆయనకు ఆర్థికంగా కలిసొచ్చిన అంశాలు ఏంటి? సిరిసిల్లలో ఖరీదైన వాహనాల్లో తిరుగుతూ.. అనుచరులతో ఓ కాన్వాయ్ మెయింటేన్ చేస్తున్న ఆ యువకుడిపై ఆర్థిక మూలాలను గుర్తించే పనిలో నిఘావర్గాలు పడ్డాయి. ఆ యువకుడి తల్లి రెండు సార్లు అధికార పార్టీ కౌన్సిలర్‌గా ఉండగా.. ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈనేపథ్యంలో ఆమె తనయుడు సిరిసిల్లకు వచ్చి పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చు చేస్తూ అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నారు. పెద్ద పెద్ద హోర్డింగ్‌లతో కార్యక్రమాలు చేపట్టడం అధికార పార్టీ నేతలకు మింగుడుపడడం లేదు. ఈ క్రమంలోనే అతని ఆర్థికమూలాలను ఆరా తీస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్, సిరిసిల్ల ప్రాంతాల నుంచి రహస్య నివేదికలు కోరినట్లు తెలిసింది. సిరిసిల్లలో మరో యూత్ ఓరియంటెండ్ కార్యక్రమానికి సదరు యువకుడు ప్రణాళిక సిద్ధం చేస్తున్న తరుణంలో నిఘా వర్గాలు ఆ యువకుడి ఆర్థిక మూలాలను ఆరా తీయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

నేడు మున్సిపల్ సమావేశం

సిరిసిల్లటౌన్: మున్సిపల్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎండీ అయాజ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశం మందిరంలో ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ జిందం కళ అధ్యక్షతన జరిగే సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

వీర్నపల్లిలో వైద్యబృందం



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

సాక్షి ఎఫెక్ట్..

వీర్నపల్లి(సిరిసిల్ల): 'వీర్నపల్లికి జ్వరం వచ్చింది' శీర్షికతో సాక్షిలో గురువారం ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు శుక్రవారం వీర్నపల్లిలో పర్యటించి పరిస్థితులు పరిశీలించారు. వైద్యసిబ్బందితో ఇంటింటా తిరుగుతూ జ్వరబాధితుల రక్తపరీక్షలు చేశారు. జ్వరపీడితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. లోకుర్తి లక్ష్మి ఇంటికెళ్లి రక్తపరీక్షలు చేసి సాధారణ జరంగా నిర్ధారించారు. అనంతరం పీహెచ్‌సీలో సిబ్బందితో సమావేశమై గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. సూపర్‌వైజర్ కొమురయ్య, గోవర్ధన్, మేరీ, నరేంద్ర, మమత, సుజాత, మంజుల, ఇందిరా ఉన్నారు.

దాడిని ఖండిస్తున్నాం

వేములవాడ: కరీంనగర్‌లోని ఎంపీ బండి సంజయ్ కార్యాలయంపై ఎంఐఎం నాయకులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అండదండలతోనే ఇలాంటి దాడులు జరుగుతున్నాయన్నారు.

అప్పులబాధతో వ్యక్తి బలవన్మరణం

బోయినపల్లి(చొప్పదండి): అనారోగ్యానికి తోడు.. ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో మండలంలోని వెంకట్రావుపల్లికి చెందిన చంద్రగిరి పెద్దయ్య(52) ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డట్లు ఏఎస్సై బాబు శుక్రవారం తెలిపారు. హమాలీ పని చేసుకునే పెద్దయ్యకు అనారోగ్యంతోపాటు ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. భార్య రాజమ్మ, కుమారుడు గంగరాజు పనిమీద బయటకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరి వేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో తన తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు కుమారుడు గంగరాజు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బాబు వివరించారు.

సమస్యలు పరిష్కరించండి

కోనరావుపేట(వేములవాడ): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. కోనరావుపేటలో సమ్మె చేస్తున్న కార్మికులకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. 2022 మార్చి బడ్జెట్ సమావేశాల్లో కార్మికుల వేతనాలు పెంచుతున్నామని సీఎం కేసీఆర్ ప్రకటించారని, ఆ హామీ అమలు చేయాలని కోరారు. కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలన్నారు.

పల్లె నుంచి ఢిల్లీకి



- మనసు కవి నలిమెల భాస్కర్
- నాటకాలతో మొదలైన ప్రస్థానం
- పుస్తకాలతో కొనసాగుతున్న బంధం
- 14 భాషల్లోని పుస్తకాలు అనువాదం
- వరించిన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం
- తెలంగాణ ఉద్యమంలో ప్రధాన పాత్ర


సాక్షి, కరీంనగర్ డెస్క్: మారుమూల పల్లెలో పుట్టి పెరిగి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. నాటకాలు వేస్తూ ప్రేరణ పొందిన వ్యక్తే.. 14 భాషలపై పట్టు సాధించారు. నందిని సిధారెడ్డి పరిచయంతో సమాజంలో అసమానతలపై రచనల ద్వారా సమాధానం చెప్పారు.. మార్క్సిజం, కమ్యూనిజం పుస్తకాల పఠనంతో తన ప్రపంచాన్ని విశాలం చేసుకున్నారు.. 25 ఏళ్ల వయసులో తన మేన మరదలిని వివాహం చేసుకున్నారు. రచయిత ఎప్పుడూ పసిమనసు కోల్పోవద్దని.. అలా ఆలోచించినప్పుడే సమాజహిత రచనలు చేయగలరని చెబుతుంటారు నలిమెల భాస్కర్. మారుమూల పల్లెటూరు నారాయణపూర్‌లో జన్మించి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకునే వరకు తాను పడిన కష్టాలు.. ఎదురైన సవాళ్లు ఆయన మాటల్లోనే..

బాల్యం.. విద్యాభ్యాసం

నా తల్లిదండ్రులు బుచ్చమ్మ–రామచంద్రం. 1955, ఏప్రిల్ ఒకటిన జన్మించాను. మాది ఇప్పటి రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్. చిన్నతనంలో కరెంట్ లేక ఎక్క దీపం వెలుతురులో చదువుకున్న రోజులు గుర్తున్నాయి. ఐదేళ్ల ప్రాయంలో పాఠశాలకు వెళ్లాను. మా గురువులు చదువు రాని వారిని కఠినంగా శిక్షించే వారు. ఐదో తరగతి తర్వాత ఎల్లారెడ్డిపేటలోని హైస్కూల్‌లో చేరాను. ఆరో తరగతిలోనే పత్రికలు చదివేవాడిని. లక్ష్మీనారాయణ సార్ ప్రోత్సాహంతో ఇంగ్లిష్ పత్రికలు చదవడం అలవాటు పడింది. కృష్ణమాచారి సార్ ప్రోద్బలంతో చరిత్రకారుల పుస్తకాలు చదివాను. నాకు పదేళ్ల ప్రాయంలోనే సాహిత్య పరిచయానికి పుస్తకాలు అనే పోషకాహారం అందింది. మేధో పరిణతి కోసం బీజాక్షరాలు అప్పుడే పడ్డాయి. ఈ ఇద్దరు సార్ల ప్రోత్సాహంతో సాహిత్యం వైపు అడుగులు పడ్డాయి. మా ఇంటి ముందున్న ఎల్.నారాయణ సార్ నేను ఐదో తరగతిలో ఉన్నప్పుడు లవకుశ నాటకం ప్రాక్టీస్ చేయించారు. అయితే మాతో నాటకం ప్రదర్శన వేయించకపోవడంతో మిత్రులం కలిసి సొంతంగా మా ఇంటి ముందే నాటకం ప్రదర్శించాం. దీనికి మా గ్రామస్తుల నుంచి ఆదరణ లభించింది. ఇలా సాంస్కృతిక పరమైన బీజాలు ఇంటి నుంచే పడ్డాయి. ఎల్.నారాయణ సార్ సూచనలతో 9వ తరగతిలో ఉన్నప్పుడు రంగనాయకమ్మ బలిపీఠం పుస్తకం చదివి.. చలించిపోయాను. ఇప్పటికీ ఆ పుస్తకం నా వద్ద ఉంది. అప్పుడప్పుడు ఆ పుస్తకాన్ని చదివి.. నన్ను.. నేను పరీక్షించుకుంటాను. 9వ తరగతిలో చలించినవిధంగానే ఇప్పటికీ స్పందిస్తున్నానా?లేదా? అని పరీక్ష పెట్టుకుంటాను. ఎందుకంటే రచయితకు స్పందించాలిసిన పసిమనసు ఉండాలి. స్పందించే హృదయం లేనప్పుడు ఎన్ని రచనలు చేసినా వృథానే. అటు చదువుతోపాటు అందరి పిల్లల్లాగానే నాకు స్నేహితులు ఉండేవారు. నా బాల్యమిత్రులు ఎలుసాని మల్లయ్య, పూదరి రాజయ్య, మామిండ్ల ముత్తయ్య, నా క్లాస్‌మేట్ మేదరి రాజయ్య, నర్మాల ముత్తయ్య, డి.కిషన్, బి.కిషన్.. ఇలా అందరం కలిసి ఆటలాడుకునేవాళ్లం.

9వ తరగతిలోనే మొదటి నవల

తొలి తెలంగాణ ఉద్యమ సమయంలో మా ఊరిలో శ్రీరామ చందాదారుల గ్రంథాలయం ఉండేది. సీఎం కేసీఆర్ ప్రధాన సలహాదారులు రమణాచారి తండ్రి అయిన రాఘవచారి పెట్టిన శ్రీరామచందాదారుల గ్రంథాలయానికి వెళ్లి వందలాది డిటెక్టివ్ నవలలు చదివాను. వాటి ప్రభావంతో 9వ తరగతిలోనే 'కాలు కదిపావో కాల్చేస్తా' అనే డిటెక్టివ్ నవల రాశాను. ఆ తర్వాత పదో తరగతిలో ఓపాట రాయగా.. అనంతరాయశర్మ అభినందించారు.



భాస్కర్ రచనలు

కామారెడ్డిలో ఇంటర్.. పుస్తకాలతో దోస్తీ

కామారెడ్డిలోని ఇంటర్మీడియెట్‌లో ప్రవేశించాక నా లోకం విశాలమైంది. అధ్యాపకులు కసిరెడ్డి వెంకటరెడ్డి, గుండి వెంకటాచార్యులు ప్రభావంతో సాహిత్యంపై ఆసక్తి పెరిగింది. ఫస్టియర్‌లో అనేక గేయాలు, పద్యాలు రాశాను. నిజామాబాద్ నుంచి ఎస్వీఎల్ నరసింహారావు తీసే 'అగ్నివీణ' పత్రికలో నేను రాసిన త్రివర్ణపతాక అనే పద్యం అచ్చు అయ్యింది. ఇలా తొలి పద్యం పత్రికలో అచ్చు కావడంతో నా సంతోషానికి అవధులు లేవు. 1973–74 కాలంలో రాసిన మూడు సాంఘిక నవలలను అచ్చు వేయలేదు. కానీ వాటిని ఇప్పటికీ భద్రంగా దాచి ఉంచాను 1974లో బీఎస్సీ సెకండియర్‌లో 'నా మానవుడా' అనే గేయసంపుటి పుస్తకాన్ని ముద్రించాం. ఆ పుస్తకాన్ని కామారెడ్డి కళాశాలకు అంకితం చేశాను. ఆ పుస్తకంలోని మొదటి గేయం ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుంచి అదే సంవత్సరంలో నాలుగుసార్లు ప్రసారమైంది. 1975లో డిగ్రీ పూర్తి చేసిన నేను.. 1976–77లో బీఈడీలో చేరాను. అదే సమయంలో 'భాస్కరోక్తులు' అనే శతకం రాశాను. 1977లో ఆంధ్రభూమిలోని ఆదివారం అనుబంధంలో నేను రాసిన 'మంద' అనే కథ ప్రచురితమైంది. ఆనాటి సమాజంలోని పరిస్థితులపై రాసిన కథ.

ఉద్యోగం.. రచనలు

నందిని సిధారెడ్డి పరిచయంతో నా దృక్పథం మారింది. మార్క్సిజం, నాస్తికత్వం, హేతువాదం పుస్తకాలు చదివాను. 1977–79 మధ్య కామారెడ్డిలోని ప్రాచ్యవిద్యాపరిషత్ ఓరియంటల్ ఎయిడెడ్ పాఠశాలలో టీచర్‌గా పనిచేశాను. అదే సమయంలో కరీంనగర్ డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగం వచ్చింది. తర్వాత మూడేళ్లలో కన్నడం, మళయాళం, తమిళ భాషలు నేర్చుకున్నాను. తెలుగు, కన్నడం, మళయాళం, తమిళ భాషల్లోని సామెతలపై 1983–85 మధ్య ఎంఫిల్ పూర్తి చేశాను. తర్వాత మరో పది భాషలు నేర్చుకున్నాను. అదే సమయంలో ఏపీపీఎస్సీ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాను. మొదటి పోస్టింగ్ భద్రాచలంలో మూడున్నర ఏళ్లు, అక్కడి నుంచి మహబూబాబాద్‌లో రెండున్నరేళ్లు పనిచేశాను. 1990లో పీహెచ్‌డీ పూర్తి చేశాను. 1991లో యూనివర్సిటీలో ఉద్యోగాల కోసం పోస్టులు పడితే దరఖాస్తు చేసుకున్నా..పైరవీలు చేతకాక అక్కడికి వెళ్లలేకపోయాను. ఈ సమయంలో 14 భాషల్లోని 30 పుస్తకాలను తెలుగులోకి అనువదించాను. ఖాళీగా ఉండడం ఏమాత్రం ఇష్టపడని నేను పుస్తకాలు చదవడం, విద్యార్థులకు పాఠాలు బోధించడంలోనే కాలం గడిపేవాడిని. తర్వాత కరీంనగర్‌లోని ఎస్సారార్ కాలేజీకి లెక్చరర్‌గా ప్రమోషన్ వచ్చింది. 2006లో కుప్పం యూనివర్సిటీ నుంచి రవ్వ శ్రీహరి అక్కడికి రమ్మని ఆహ్వానించినా వెళ్లలేదు. 2011లో వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాను. నేను రాసిన పుస్తకాలలో కవిత్వం.. కథలు.. పద్యాలు.. ఇలా తెలుగులోని అన్ని ప్రక్రియలు ఉన్నాయి.

తెలంగాణ ఉద్యమంలో..

- 9వ తరగతి చదివే రోజుల్లో తొలి తెలంగాణ ఉద్యమం ఉగ్రరూపంలో ఉండేది. ఆ సమయంలో ఆర్టీసీ బస్సుల్లో ఎక్కి 'జై తెలంగాణ' అంటే టిక్కెట్ తీసుకునేవారు కాదు.
- ఆ సమయంలో వేములవాడ సమీపంలోని తిప్పాపూర్‌లో తెలంగాణ ఉద్యమకారులు ఓ సభను పెట్టారు. దానికి పోలీసుల నిర్బంధం ఉండేది. అయినా వేలాది మంది జనం ఆ సభకు తరలివచ్చి, విజయవంతం చేశారు. ఆ సమయంలో నామిత్రులం వెళ్లాం. రాత్రి కావడంతో బస్సులు లేక రాత్రంతా వేములవాడ మూలవాగులోని ఇసుకదిబ్బలపైనే పడుకని తెల్లవారి ఊరికి వచ్చాం.
- మలిదశ ఉద్యమ సమయంలో తెలంగాణ రచయితల వేదిక వ్యవస్థాపకుడు, తొలి అధ్యక్షుడు నందిని సిధారెడ్డి నన్ను పిలిచి తెలంగాణ మలిదశ ఉద్యమంపై మాట్లాడాలన్నారు. నీళ్లు..నిధులు.. నియామకాలపై ఉన్న వివక్ష పోగొట్టేలా మాట్లాడాను. ఆ సమయంలో తెలంగాణ భాష, యాసపై అన్ని ప్రాంతాల్లో తిరిగి ప్రసంగించాను.
- ఇరవై ఏళ్ల క్రితం 'తెలంగాణ పదకోశం' పుస్తకాన్ని వేశాను. ఇప్పటికీ చాలా సార్లు ముద్రితమైంది.
- తెలంగాణభాష–దేశ్య పదాలను, తెలంగాణ భాష అవలోకనం, బాణం.. అనే పరిశోధనాత్మక ఉపన్యాసాలు ఇచ్చాను.

పురస్కారాలు

- 2010లో మళయాల నవల 'స్మారకశిలలు' తెలుగులోకి అనువదించాను. దానికి 2013లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది.
- అద్దంలో గాంధారి అనే అనువాద పుస్తకాన్ని ఆరు భాషల్లో వేశాను. దానికి 1997లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం అనువాద పురస్కారం వచ్చింది.
- బోయి భీమన్న గారి రూ.లక్ష పురస్కారం తెలంగాణ ప్రభుత్వం అందజేసింది.
- ఇంకా అనేకం అవార్డులు.. పురస్కారాలు అందుకున్నాను.

రేపటి నుంచి అర్చకులకు పునశ్చరణ తరగతులు

వేములవాడ: రాజన్న సన్నిధిలో అక్టోబర్ 1 నుంచి 3వ తేదీ వరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ధూపదీప నైవేద్యం స్కీం ద్వారా 250 మంది అర్చకులకు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యే వారికి వసతి, భోజనం ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు ఆలయ అధికారులకు ఈవో కృష్ణప్రసాద్ విధులు కేటాయించారు. వైదిక స్మార్థ ఆగమ తరగతులను ఆలయ ఉపప్రధాన అర్చకులు చంద్రగిరి శరత్‌శర్మ, శైవ ఆగమ శిక్షణ తరగతులు ఉపప్రధాన అర్చకులు నమిలకొండ రాజేశ్వరశర్మ నిర్వహిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రోడ్డెక్కిన ఆశలు.. అంగన్‌వాడీల విన్నపాలు

- నిరసనలతో హోరెత్తిన సిరిసిల్ల

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న కార్మికుల నిరసనలు హోరెత్తాయి. ఈ పంచాయితీ టెక్నికల్ వింగ్ ఉద్యోగులు శాంతియుత సమ్మెకు దిగారు. ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో కార్మికులు, ఉద్యోగులు తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ సమ్మెలో భాగంగా వినూత్నంగా నిరసన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశవర్కర్లు, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు, మధ్యాహ్న కార్మికులు ఆందోళనలు చేపట్టారు. తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ ఆశవర్కర్లు వినాయక విగ్రహాలకు వినతిపత్రాలు అందించి నిరసన తెలిపారు. అంబేడ్కర్ చౌరస్తాలో వందలాది కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఆశవర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బదవేణి మంజుల, ప్రధాన కార్యదర్శి జయశీల, చంద్రకళ, లత, రాణి, లావణ్య పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

జిల్లా స్థాయిల్లో పనిచేసే ప్రాజెక్టు మేనేజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ అసిస్టెంట్లకు పేస్కేలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ పంచాయతీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శుక్రవారం శాంతియుత సమ్మె చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బండి స్వామి, గడ్డం శేషాద్రి, నర్సింగోజు శ్రీధర్, శానగొండ రమేశ్, శ్రీనివాస్, రఘు పాల్గొన్నారు.



ఈ పంచాయితీ ఉద్యోగులు శాంతియుత నిరసన

సమస్యలు పరిష్కరించండి

ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్డీవో ఆఫీస్ ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కదారి రాములు, అంగన్‌వాడీ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత, కొండికొప్పుల పద్మ, శ్యామల పాల్గొన్నారు.

బతుకమ్మలతో నిరసన

ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు నిరవధిక సమ్మెలో భాగంగా బతుకమ్మలతో ర్యాలీ తీశారు. కార్మికుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వ పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. మధ్యాహ్న కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మీస లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మి, సత్తయ్య, సావిత్రి, మల్లవ్వ, నర్సయ్య, మంజుల, రేణుక, కనకలక్ష్మి ఉన్నారు.

అధికార పార్టీకి వారంటీ ముగిసింది

- గ్యారంటీగా ఇంటికి పంపడమే
- కేటీఆర్ అహంకార పూరితంగా మాట్లాడొద్దు
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో అధికార పార్టీ బీఆర్‌ఎస్‌కు వారంటీ ముగిసిందని ఇక సీఎం కుటుంబ సభ్యులు గ్యారంటీగా ఇంటికి పంపడమేనని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల గంభీరావుపేట సభలో మంత్రి కేటీఆర్ కాంగ్రెస్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ విలేకరులతో మాట్లాడారు. టీఆర్‌ఎస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌గా మారిందని ఇక ఆ పార్టీకి ఉన్న వారంటీ, గ్యారంటీ తప్పకుండా ముగిసిందన్న విషయాన్ని మంత్రి కేటీఆర్ జీర్ణించుకోలేక కాంగ్రెస్‌పై అక్కసు వెళ్లగక్కుతున్నారన్నారు. తనపై కూడా దురహంకారంతో వ్యాఖ్యలు చేశారని, అయినా తాము విజ్ఞతతో కేటీఆర్‌పై అలాంటి వ్యాఖ్యలు చేయబోమన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చి తనను ఎన్ని మాటలైనా అనాలన్నారు. సిరిసిల్ల జిల్లాను ఇక్కడి సబ్బండ వర్గాలు ఏకమై పోరాడి సాధించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ ఇస్తామని కరీంనగర్ సభలో ఇచ్చిన మాటను సోనియాగాంధీ నిలబెట్టుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం వస్తే విజయభేరి సభలో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలు అమలై బీఆర్‌ఎస్ నామరూపాల్లేకుండా పోతుందన్న భయం సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులకు పట్టుకుందని ఎద్దేవా చేశారు. సిరిసిల్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని గప్పాలు కొడుతున్న కేటీఆర్‌కు దమ్ముంటే అంబేడ్కర్ చౌరస్తాలో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, జిల్లా మాజీ అధ్యక్షుడు నాగుల సత్యానారాయణగౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత, ఆకునూరి బాలరాజు, వెల్ముల స్వరూప, సూర దేవరాజు, గోనె ఎల్లప్ప, హైమద్‌ఖాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

బోయినపల్లి(చొప్పదండి): రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని విలాసాగర్‌లో శుక్రవారం రూ.22 లక్షలతో నిర్మించిన రైతువేదిక భవనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు లభిస్తున్నాయని తెలిపారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, సర్పంచ్ జూలపల్లి స్వప్నాంజలి, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, ఆర్బీఎస్ మండలాధ్యక్షుడు కొనుకటి లచ్చిరెడ్డి, ఎంపీవో ప్రణీత, బుర్ర గోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని విలాసాగర్, మర్లపేట గ్రామాలకు చెందిన పలువురు యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు.



రైతువేదిక భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే